క్లుప్తంగా

మీనకోటలో వైద్య శిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని మీనకోటలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. అక్కడ రెండు డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కావడంతో గ్రామంలో 18 మందికి రక్త పరీక్షలు చేసినట్టు దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భాను ప్రతాప్ తెలిపారు. గ్రామంలో ఇద్దరికి డెంగీ సోకడంతో చికిత్స అందిస్తున్నామన్నారు. గ్రామంలో ఇంటింట సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అలాగే దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ సబ్‌యూనిట్ అధికారి జె.మోహన్‌రావు పాల్గొన్నారు.

విద్యుదాఘాత ఘటనపై విచారణ



ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న సీఐ మురళీధర్

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మన్ గురాన శ్రీనివాసరావు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన విషయం విధితమే. బాధితుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై పాలకొండ సీఐ మురళీధర్ మంగళవారం గడగమ్మ గ్రామంలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతానికి జేఎల్‌ఎం శ్రీనివాసరావు ఎందుకు రావాల్సి వచ్చింది, ఆయనతో ఎవరెవరు ఉన్నారు, పొలంలో ఉన్న విద్యుత్ వైర్లకు సరఫరా ఉన్న విషయం తెలియదా తదితర విషయాలను ట్రాన్స్‌కో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల నుంచి కూడా వివరాలు సేకరించారు. ఆయనతో పాటు ఎస్ఐ ఎం.వెంకటరమణ ఉన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి

వీరఘట్టం: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించి మెరుగుపర్చేందుకు కృషిచేయాలని పాలకొండ ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బయొలాజికల్ సబ్జెక్టుపై నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. సబ్జెక్టును సులువుగా బోధించడం, బొమ్మలు, నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంఈఓ ఆర్.ఆనందరావు, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గడపగడపకు' నిధులతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు నిర్మాణం కోసం జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో ఇటీవల నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం'లో మంజూరైన రూ.20 లక్షల నిధులతో మంగళవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు తెలిపారు. రూ.2 లక్షలతో విద్యుత్‌శాఖకు సంబంధించిన పనులను, రూ.4.95 లక్షలతో శ్మశానవాటిక వద్ద షెడ్డు నిర్మాణం, రూ.13.05 లక్షలతో సీసీ రోడ్డులు, డ్రైయిన్స్ నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. వారం రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి చేయిస్తామన్నారు.

బ్యాగ్ లభ్యం



భామిని: మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఒక పెద్ద బ్యాగును స్థానికులు మంగళవారం గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు విడిచిపెట్టి ఉంటారని భావించి దాన్ని తహసీల్దార్ కార్యాలయానికి చేర్చారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు సూచనల మేరకు దాన్ని స్థానిక సచివాలయంలో భద్రపరిచారు. ఎవరైనా బ్యాగును పోగట్టుకున్నట్లయితే తగిన ఆధారాలతో సంప్రదించాలని స్థానిక సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.



కొమరాడ: అర్తాంలో జరిగిన కార్యక్రమంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి శ్యామల



వీరఘట్టం: బిటివాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు



సీతంపేట: పెద్దూరులో అర్జీదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి, తదితరులు



పాలకొండ రూరల్: గొట్ట మంగళాపురంలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జియ్యమ్మవలస: గవరమ్మపేట పంచాయతీలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ సత్యంనాయుడు, ఎంపీటీసీ లక్ష్మునాయుడు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష'తో ప్రభుత్వ సేవలు సత్వరమే అందుతాయని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత ఉన్నా సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో పథకాలు పొందలేనివారికి 'జగనన్న సురక్ష'తో ఎంతో మేలు జరుగుతుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

గిరిజన గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



సంతోషపురం గ్రామ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి
- సంతోషపురం, మీగడ గ్రామాల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాం మండలం పాడి పంచాయతీ పరిధి నాగర బీటీరోడ్డు నుంచి సంతోషపురం వరకు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు, సంతోషపురం నుంచి మీగడ గిరిజన గ్రామానికి రూ.1 కోటి 50 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రధానంగా గిరిజన గ్రామాలకు అవసరమైన రహదారి, తాగునీరు, వైద్యం, విద్య సౌకర్యాల పైనే దృష్టి పెట్టామని, మాట ఇస్తే మడమ తిప్పమన్నారు. గత టీడీపీ పాలనలో గిరిజనులకు చేసిందేమీ లేదని, నాటి పాలనలో సంక్షేమ పథకాలు వలన టీడీపీ నాయకులు లబ్ధిపొందారే తప్పా పేదలకు చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాడి గ్రామ సర్పంచ్ సుస్మిత, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీ రంగారావు, ఎంపీటీసీలు టి.సునీత, టి.వి.ఎస్.స్వామియాజులు, కళింగ వైశ్య, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు కొత్తకోట వెంకట సురేష్‌కుమార్, గవర విజయ్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, జిలాని, ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం డీఈ సింహాచలం, ఏఈ శ్యామ్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మల వెంకటరావు, సుబ్బు, నూరెళ్ల, ఆకుల శ్రీధర్, రాయిపిల్లి శ్రీను, శ్రీధర్, తిమ్మక కోటి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: ప్రాథమిక పాఠశాల విద్యను బలోపేతం చేయాలని డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషిచేయాలన్నారు. ఆన్‌లైన్ యాప్‌లు, థంబ్‌లతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులంతా యూనిఫాం, షూ వేసుకునేలా చూడాలన్నారు. ట్యాబ్‌లు సక్రమంగా వినియోగించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: మండలంలోని పీపీ ఈతమానుగూడ, చింతలగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. రసాయిన ఎరువులు, పురుగు మందుల వాడకం వలన మానవాళికి, ప్రకృతికి కలిగే నష్టాలను వివరించారు. ఘన, ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ సంజీవరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అమానుషం



గరుగుబిల్లిలో సీఐటీయూ నేతల ర్యాలీ

గరుగుబిల్లి: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానుష దాడికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మైతేయ్ కులస్తులను గిరిజన జాబితాలో చేర్చి కేంద్ర ప్రభుత్వం మైతేయ్, కుకి తెగల మధ్య ఘర్షణకు పురిగొల్పిందని మండిపడ్డారు. ఈ ధోరణి ప్రజాస్వామ్య దేశంలో సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీవీ రమణ, వి.ఇందిర, వై.మన్మథరావు, సావిత్రి, స్వాతి, కృష్ణవేణి, మాలతి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడిపై దాడి చేయడం తగదు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎం.గణపతిరావుపై హైస్కూల్ చైర్మన్ శంకరరావు దాడి చేయడాన్ని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు ఖండించారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి శ్లాబ్ సెంట్రింగ్ చేసేందుకు 15 రోజుల ఒప్పందం చేసుకున్నారని, సెంట్రింగ్ వేశాక 15 రోజులు గడిచిపోయాక అదనంగా డబ్బులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించకుండా గణపతిరావుపై దాడికి దిగడం అన్యాయమని అన్నారు. కార్మికుడిపై దాడికి పాల్పడిన శంకరరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెట్లకొమ్మల తొలగింపు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి గరుగుబిల్లి మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్ వైర్లను తాకుతున్న చెట్లకొమ్మలను విద్యుత్‌శాఖ సిబ్బంది మంగళవారం తొలగించారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

ఐటీడీఏ పీఓ అభినందన

సీతంపేట: ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాల్లో సీతంపేట ఏజెన్సీ గిరిజనులు సంప్రదాయ నృత్యాలు, చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనబర్చినందుకు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అభినందించారు. జగతపల్లికి చెందిన సవర ఉమాశంకర్‌కు చిత్రలేఖనంలో తృతీయస్థానం, అదేవిధంగా గిరిజన నృత్యంలో దారపాడుకు చెందిన బృందానికి తృతీయస్థానం లభించింది. అక్కన్నగూడకు చెందిన సవర మంగమ్మకు అగర్బత్తీ యూనిట్ నిర్వహణకు ప్రోత్సాహకంగా రూ.10 వేలు అందజేశారు. అలాగే చిరుధాన్యాల వ్యాపారాన్ని ప్రోత్సాహానికి రూ. 10వేలు పెద్దూరుకు చెందిన పాలక పార్వతికి గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతుల మీదుగా విశాఖపట్నంలో అందుకున్నారు. వారిని పీఓ అభినందించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

భామిని: గ్రామాల్లో అంటువ్యాధుల ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ గుండేల చంద్రరావు, ఈఓపీఆర్డీ గుర్ల కృష్ణారావు సూచించారు. బాలేరు పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో డెంగీ జ్వరాలు బయటపడడంతో వైద్య శిబిరం నిర్వహించాలని, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సత్యవతికి సూచించారు.

మన్యం సహజ ఉత్పత్తిదారు కంపెనీకి అవార్డు



విజయవాడలో అవార్డు అందుకుంటున్న ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు

సీతంపేట: మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అవార్డు వరించింది. 42వ నాబార్డు ఫౌండేషన్ డే సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్లు ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, సీఈఓ బి.శంకరరావు మంగళవారం తెలిపారు. 2017 నుంచి సీతంపేట ఏజెన్సీలో 70 గ్రామాల్లో మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సేవలందిస్తోందన్నారు. గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, వివిధ రకాల అటవీఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం వంటివి చేస్తున్నట్లు చెప్పారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

కురుపాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు చేర్పులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అందరి సహాయ సహకారాలతో ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, రాధాకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరచాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలని ఎంఈఓలు చంద్రశేఖర్, జనార్దననాయుడు అన్నారు. మండలంలోని టిక్కబాయిలో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా బోధించాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని, జగనన్న విద్యాకానుక కిట్లు ఎవరికైనా అందకుంటే వెంటనే అందించాలని, మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు పి.దేవానంద్, సింహాచలం ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.

విద్యార్థుల నిరసన



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

కురుపాం: సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కురుపాంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల్లో తగినంత మంది అధ్యాపకులు లేక, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆరిక రంగారావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం



సంక్షేమ లబ్ధిపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. హడ్డుబంగి గ్రామసచివాలయం పరిధిలో హడ్డుబంగి, హడ్డుబంగి కాలనీ, జామితోట తదితర గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భగా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు గుర్తించి వెంటనే అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అందరికీ న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. నవరత్నాల ద్వారా అందిస్తున్న పథకాలకు కేవలం అర్హతే ప్రామాణికమని, పథకాల లబ్ధిలో ఎలాంటి తారతమ్యాలకు తావివ్వకుండా అందిస్తున్నామన్నారు. ప్రతీ ఇంట్లోను సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నామని ఆనందంగా చెబుతున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హాయంలో పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి గృహాలను నిర్మించారని, తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు పేదలకు సెంటు స్థలాన్ని కూడా ఇవ్వలేకపోయారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేశారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ఇంటిముంగిటకే తీసుకువచ్చారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ సుమతి, ఎంపీటీసీలు సరోజిని, మంగయ్య, పార్టీ నాయకులు ఎస్.షోడంగ, ఎం.రామారావు, ఎస్.రాము,పకీర్, రాజారావు, ఎస్.కాంతారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి



ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

గరుగుబిల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్లకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గరుగుబిల్లి పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యఆరోగ్య కేంద్ర అధికారులకు, స్థానిక పీహెచ్‌సీ సిబ్బందికి ముందుగానే తెలియజేసినప్పటికీ విధులకు గైర్హాజరైనట్లు ఆశావర్కర్లకు అధికారులు నోటీసులు జారీచేయడం అన్యాయమన్నారు. నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బీవీ రమణ, ఇందిర, మన్మథరావు ఉన్నారు.

భూసర్వేను సద్వినియోగం చేసుకోండి



రోవర్ సాయంతో సర్వే చేస్తున్న సిబ్బంది

పాలకొండ: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్వేయర్ పి.వెంకటరావు కోరారు. పాలకొండ పట్టణం పరిధిలో చేపట్టిన భూముల రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. భూసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. మైదాన ప్రాంతాలతో పాటు తోటలు ఉన్న చోట రోవర్ ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి తమ భూములకు సంబంధించిన సమాచారం సర్వే సిబ్బందికి అందించాలని కోరారు.